

స్టాల్‌ను తిలకిస్తున్న కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఐఎంఏ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎనమల్ల నరేశ్, ప్రముఖ గైనకాలజిస్ట్ విజయలక్ష్మి, నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు

## ప్రాపర్టీ షో సందడి

కరీంనగర్ కార్పొరేషన్/ కమాన్‌చౌరస్తా, మార్చి 8 : 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షో సందడిగా మారింది. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తాలో గల రాజరాజేశ్వర కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ షోను సందర్శించేందుకు మొదటి రోజు శనివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తూ వివరాలు తెలుసుకున్నారు. ఇల్లు, ప్లాట్లు కొనుగోలు చేయాలనుకునేవారు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వెంచర్లలోని ప్లాట్ల ధరలు, బ్యాంకు రుణాల గురించి ఆరాతీశారు. కాగా ఆదివారం కూడా కొనసాగనుండగా, అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నది.

**ప్రాపర్టీ షో అదుర్స్**

- తొలిరోజు గ్రాండ్ సక్సెస్
- 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ప్రదర్శన

13వ పేజీలో



వెల్దుర్తిలో లెంపలేసుకుంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

## గెలిపిస్తే కాంగ్రెస్‌లో చేరిండు

- ఓటేసి తప్పు చేసినం
- జగిత్యాల మండలం వెల్దుర్తిలో లెంపలేసుకుని మహిళల నిరసన

జగిత్యాల రూరల్, మార్చి 8 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మక తాము స్థానిక ఎమ్మెల్యేకు ఓటు గెలిపించుకుంటే.. మళ్లీ ఆయన కాంగ్రెస్‌లో చేరారని, ఆయనకు ఓటేసి తప్పు చేశామని జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామంలో శనివారం పలువురు మహిళలు లెంపలేసుకుంటూ నిరసన తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మండిపడ్డారు.



కొలనూర్ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై వెళ్తున్న కారు

## రైలు పట్టాలపై కారు

- ఆసక్తిగా తిలకించిన ప్రజలు

ఓదెల, మార్చి 8: రోడ్డుపై కార్లు వెళ్లడం ఇప్పటివరకు మనం చూసినం. కానీ అదే కారు రైలు పట్టాల పై పరుగెడుతుంటే ఆసక్తి కనబరుస్తుంది. ఇలా శనివారం కొలనూర్ రైల్వే స్టేషన్‌లో చూపరులను ఆకట్టుకుంది. రైల్వే పట్టాల పని తీరును కారులో ప్రయాణిస్తూ పరీక్షించే కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. తక్కువ సమయంలో ఎక్కువ కిలో మీటర్లు ప్రయాణిస్తూ రైలు పట్టాలు ఏలా ఉన్నాయో పరీక్షిస్తున్నారు రైల్వే అధికారులు. ఈ వాహనాన్ని రోడ్డు కమ్ రైల్ వే(ఆర్ఆర్‌వీ) వ్యాన్ అంటారు. ఈ వాహనం రోడ్డు పై టైర్లతో, రైలు పట్టాల పై ఇనుప చక్రాలతో నడిచే విధంగా తయారు చేశారు. ఈ వాహనం ద్వారా రైల్వే సిబ్బంది ట్రాక్‌ను సూపర్‌వైజర్ చేస్తుంటారు. ఈ కారు మాదిరి వాహనం శనివారం కొలనూర్ స్టేషన్ నుంచి పట్టాలపై పరుగెడుతుంటే ప్రజలు ఆసక్తిగా తిలకించారు. భలేగా ఉందే అంటూ చెప్పుకొన్నారు.

## చి'వరి'కి కన్నీరు

కోనరావుపేట మండలం ధర్మారం శివారులో ఎండిన వరి పంటను మేస్తున్న గొర్రెలు



- అడుగంటిన భూగర్భజలాలు
- ఎండుతున్న పొలాలు
- పశువులు మేతగా మారిన పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- ఆదుకోవాలని వేడుకోలు

కోనరావుపేట, మార్చి 8: ఎన్నో ఆశలతో యాసంగిలో సాగుచేసిన వరి పొలాలు నీరు లేక నెర్రెలుబారుతున్నాయి. కోనరావుపేట మండలంలో ఈ యాసంగి సీజన్‌లో దాదాపు 17,800 ఎకరాలకు పైగా వరి పంటలను రైతులు సాగుచేశారు. ఇందులో ధర్మారం, పల్లిమక్త, వెంకట్రావుపేట, ఏగ్లాస్‌పూర్, శివంగాళపల్లి, నిజామాబాద్, కనగర్తితో పాటు పలు గ్రామాల్లో నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. పొట్ట దశకు వచ్చిన వరి పంట సాగునీరు లేక పంటలు ఎండిపోవడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. తలాపున ఉన్న మల్కపేట రిజర్వాయర్‌లో 0.75టీఎంసీ డెడ్ స్టోరేజీ ఉన్న భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో రైతులు నీళ్లు లేక బోరుమంటున్నారు. వ్యవసాయ బావుల్లో నీరు లేకపోవడం, బోరు మోటార్లలో నీరు రాకపోవడంతో రైతులు లక్షలు వెచ్చించి సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ బావుల్లో క్రేన్ల సాయంతో పూడికతీత, సైడ్ బోర్లు వేస్తున్నారు. అంతేకాకుండా బోరు మోటార్లలో నీరు ఎండిపోవడంతో పంటపొలాలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



వ్యవసాయ బావిలో సైడ్ బోర్ వేయిస్తున్న రైతు

### బావి తవ్వించిన ఫలితం లేదాయె



నాకు ధర్మారంలో రెండెకరాల భూమి ఉన్నది. కొత్తగా బావి తవ్వించిన. కొన్ని నీళ్లు ఉండడంతో రెండెకరాల్లో వరి వేసిన. అయితే భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రూ.2లక్షలతో సైడ్‌బోర్లు వేయించిన. అయినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పంట పొట్ట దశలోనే ఎండిపోతున్నది.

**- కొమ్ము తిరుపతి, రైతు, ధర్మారం(కోనరావుపేట)**

### ఎకరం ఎండిపోయింది..



నాకున్న ఎకరం పొలంలో వరి వేసిన. నీళ్లు లేక పంట ఎండిపోయే దశకు రావడంతో పక్క రైతుల బావి నీటిని అడిగి పారించిన. అయినకూడా నీళ్లు అందకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమీ లేక గొర్రెల కాపరులకు పంటను మేత కోసం ఇచ్చిన. పంట పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయిన.

**- ఆసరి రాజయ్య, రైతు, ధర్మారం(కోనరావుపేట)**








కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని సన్మానిస్తున్న మహిళా అధికారులు, మహిళలు

## ఘనంగా మహిళా దినోత్సవం

కలెక్టరేట్, మార్చి 8 :మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి, పలు రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను, మహిళా అధికారులు, కార్మికులను ఘనంగా సన్మానించారు. ఆయా విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

## క్రేన్‌లకు మళ్లీ పని

గత పదేళ్లలో బావులు తవ్వించడం.. పూడిక తీత లేక మూలకు పడ్డ క్రేన్ యంత్రాలకు ప్రస్తుత సర్కారు పుణ్యమాని మళ్లీ పని దొరికింది. ఈ ఏడాది బావుల్లో సాగు నీరు పాతాళానికి చేరడంతో బావులకు ఏర్పాటు చేసి పైకి మట్టి ఎత్తిపోస్తున్నాయి. నాడు కాళేశ్వరం ఎత్తిపోతలతో సంబురంగా రెండు పంటలు సాగు చేయగా, నేడు బావుల్లో పాతాళానికి చేరిన నీటితో యాసంగి పంటలు కాపాడే పరిస్థితి లేకపోవడంతో ప్రతి వ్యవసాయ బావిపై క్రేన్, జేసీబీ ఏర్పాటు చేస్తూ మట్టిని బయటకు ఎత్తిపోస్తున్నారు.

**- గంభీరావుపేట, మార్చి 8**



వ్యవసాయ బావి నుండి క్రేన్‌తో పూడిక తీస్తున్న కూలీలు


























